సాక్షి పెద్దపల్లి

శనివారం । 22 । జూలై । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,859

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌యార్డులో శుక్రవారం పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.6,859, కనిష్టం రూ.6,058, సరాసరి ధర రూ.6,838 పలికింది.



విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

విద్యార్థులకు మంచి విద్య, నాణ్యతతో కూడిన ఆహారాన్ని ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడాలని మైనార్టీ గురుకులాల అధ్యక్షుడు ఏకే ఖాన్ అన్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురుస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అర్హులను ఓటరుగా నమోదు చేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

జ్యోతినగర్(రామగుండం): అర్హులను ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి సీహెచ్.ప్రియాంక అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో రామగుండం మండల బూత్ లెవల్ అధికారుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బూత్ లెవల్ అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బీఎల్‌వోలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఓటరు నమోదు ఫారం పూరించే సమయంలో పొరపాట్లకు తావీయకుండా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ జాహెద్ పాషా, మాస్టర్ రిసోర్స్ పర్సన్స్ అంజన్‌కుమార్, గద్దె శ్రీనివాస్, సంతోష్‌కుమార్, శ్రీధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కండె రహదారిలో రాతి విగ్రహాలు



ఉత్సవమూర్తుల రాతి విగ్రహాలు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామ శివారులోని కండె రహదారి మీదుగా పెద్దపల్లికి వెళ్లు రహదారిలో శుక్రవారం ఉత్సవమూర్తుల రాతి విగ్రహాలు వెలుగుచూశాయి. ఇందులో మూడు నంది విగ్రహాలు, రెండు శివలింగాలు, ఒకటి హనుమాన్ తదితర రాతి విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడికి తరలించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కాగా కండె రహదారి నిర్మాణ పనులు చేపట్టిన క్రమంలో పురాతన రాతి విగ్రహాలు లభ్యం కావడంతో వాటికి హనుమాన్ భక్తులు పూజలు చేసేవారు తుండగా, మరిన్ని రాతి విగ్రహాలను ఇక్కడికి తరలించడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

నంది పంప్‌హౌజ్ నుంచి నిలిచిన ఎత్తిపోతలు

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం నందిమేడారం గ్రామ శివారులోని నంది పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోస్తున్న పంప్‌లను శుక్రవారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులు నిలిపివేశారు. గత పదిహేను రోజులుగా కాళేశ్వరం నీటిని పంప్‌ల ద్వారా నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తూ అక్కడ నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయిత్రీ పంప్‌హౌజ్‌కు తరలించారు. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో మోటార్‌లను నిలిపివేసినట్లు ఇంజినీరింగ్ అధికారి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



నాగభూషణం

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎం.నాగభూషణం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ డిపో–2లో అసిస్టెంట్ ఇంజినీర్(ఎం)గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది సాదర స్వాగతం పలికారు. గతంలో ఇక్కడ డీఎంగా పని చేసిన పి.మల్లేశం హైదరాబాద్ బదిలీ అయ్యారు.

తిరుపతికి మరో వారాంతపు రైలు

రామగుండం: హిసార్ నుంచి తిరుపతికి వెళ్లు వారాంతపు రైలుకు పెద్దపల్లి జంక్షన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు హాల్టింగ్ కల్పించారు. ఫలితంగా జిల్లా కేంద్రం నుంచి తిరుపతికి రెండో వారాంతపు రైలు అందుబాటులోకి వచ్చినట్లయింది. ఈ రైలు ప్రతీ ఆదివారం పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 9.45 గంటలకు వచ్చి మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకు తిరుపతికి చేరుకోనుంది.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

పెద్దపల్లిరూరల్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను నియంత్రించి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లి బస్టాండ్ వద్దగల అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా మణిపూర్‌లో రెండు తెగల మధ్య హింస చెలరేగి తారాస్థాయికి చేరినా కేంద్రం జోక్యం చేసుకోకపోవడం సరికాదన్నారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. జ్యోతి, ప్రశాంత్, రవీందర్, శ్రావణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జలకళ..

- దండిగా వాన.. నిండుగా సాగు
- జలాశయాల్లోకి వరద.. పెరుగుతున్న నీటిమట్టం
- నిండుకుండలా ఎల్లంపల్లి ప్రాజెక్టు
- గోదావరి, మానేరులో పెరుగుతున్న వరద ఉధృతి

సాక్షి, పెద్దపల్లి: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లా తడిసిముద్దవుతోంది. ఐదురోజులుగా దండిగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఎల్లంపల్లి, పార్వతి బ్యారేజీ, చెరువులకు వర్షపు నీరు భారీగా వచ్చి చేరుతోంది. సీజన్ ముమ్మురంగా సాగిన సమయంలో దాదాపు 20రోజులు వానల్లేక అల్లాడిన అన్నదాతలకు ప్రస్తుత వర్షాలతో ఊరట లభిస్తోంది. దీంతో సాగు పనులు జోరందుకున్నాయి.

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల చెక్‌డ్యాం వద్ద పరవళ్లు తొక్కుతున్న మానేరు





పూర్తి నీటి మట్టానికి చేరిన ఎల్లంపల్లి ప్రాజెక్టు

ప్రాజెక్టులకు భారీగా వరదనీరు

- గతేడాది కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులకు భారీగా వరద నీరు పోటెత్తడంతో ఒక్కసారిగా దిగువకు నీటిని వదిలివేశారు. దీంతో ఎల్లంపల్లికి రికార్డు స్థాయిలో వరదనీరు రావడంతో అంతే మొత్తంలో దిగువకు వదలివేశారు. దీంతో గోదావరిఖని, మంథని పట్టణంలో పలు కాలనీలు నీటమునిగిపోయాయి. కాగా ఈసారి పైనుంచి వచ్చే వరదను అంచనా వేస్తూ, అందుకు తగినట్టుగా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి, సుందిళ్ల నుంచి శుక్రవారం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండటంతో అధికారులు ఇప్పటికే గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను, గొర్రెలు, పశువుల కాపారులను అలర్టు చేశారు. పై నుంచి వరదతో గోదావరి, మానేరులో నీటి ప్రవాహం పెరిగింది. అలాగే జిల్లాలో 1,067 చెరువులుండగా, అందులో సుమారు 60శాతం చెరువులు మత్తడి దూకుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ముంపు లేకుండా చర్యలు చేపట్టాలి



బ్యారేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టుతో మంథని ప్రాంత రైతాంగానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని, బ్యాక్ వాటర్‌తో ముంపు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు కోరారు. శుక్రవారం మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీని సందర్శించారు. నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బ్యాక్ వాటర్ మూలంగా వ్యవసాయ భూములు, నివాస గృహాల్లోకి నీరు చేరకుండా చూడాలన్నారు. గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం బెస్తపల్లి గ్రామాన్ని సందర్శించి వారితో మాట్లాడారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు	
నీటి నిల్వ సామర్థ్యం	20.18 టీఎంసీలు
ప్రస్తుత నిల్వ ఉన్న నీరు	18.25 టీఎంసీలు
మొత్తం గేట్లు	62
ఓపెన్ చేసిన గేట్లు	20
ఇన్ ఫ్లో	1.02 లక్షల క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	2.53లక్షల క్యూసెక్కులు

సుందిళ్ల ప్రాజెక్టు	
పూర్తిస్థాయి నీటిమట్టం	130మీటర్లు
నీటి నిల్వ సామర్థ్యం	8.83 టీఎంసీలు
గేట్ల సంఖ్య	74
ఓపెన్ చేసిన గేట్లు	60
ఇన్‌ఫ్లో	2.60 లక్షల క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	2.75 లక్షల క్యూసెక్కులు

జిల్లాలో అత్యధిక వర్షాపాతం నమోదైన ప్రాంతాలు (మి.మీ)	
జూలపల్లి	15.8
కూనారం	10.5
ముత్తారం	10.3
సుగ్లాంపల్లి	9.5
ఎలిగేడు	9.3
రంగంపల్లి	9.0
భోజన్నపేట	8.8
కమాన్‌పూర్	8.5
కనుకుల	8.3
కల్వచర్ల	7.8
రామగుండం	7.5
అకినేపల్లి	6.8



మత్తడి దూకుతున్న అప్పన్నపేట చెరువు

కంట్రోల్ రూం ఏర్పాటు

- భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాగాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అప్రమత్తం చేశారు. గతేడాది ముంపు ప్రాంతాలను గుర్తించి, అక్కడి వారిని అప్రమత్తం చేశారు. లోలెవల్ వంతెనల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చెరువు, కుంటల కట్టలను పరిశీలించి తెగిపోకుండా చూడాలన్నారు. అత్యవసర సేవలకు జిల్లా కేంద్రంలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. సమస్యలు ఉంటే 79950 70699 నంబర్‌కు ప్రజలు ఫోన్ చేయాలని సూచించారు.

వర్షంతో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

- 1.80 లక్షల టన్నుల ఉత్పత్తికి ఆటంకం



ఓసీపీ-3 క్వారీలోకి వస్తున్న వర్షపు నీరు

గోదావరిఖని(రామగుండం): ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. నాలుగురోజుల్లో 178 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రామగుండం రీజియన్‌లోని ఓసీపీ–1,2,3, జీడీకే–5 ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. నాలుగు ఓసీపీల్లో ఓవర్‌బర్డెన్ వెలికితీత పనులు ఆగిపోయాయి. వర్షాలకు ఇబ్బంది లేకుండా ముందే స్టాక్ యార్డులో నిల్వ చేసిన బొగ్గును వినియోగదారులకు రవాణా చేస్తున్నారు. వర్షం ఎప్పుడు నిలిచిపోయినా రెండుగంటల్లోగా పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సురక్షిత ప్రాంతాలకు భారీ యంత్రాలు

భారీ వర్షాల మూలంగా క్వారీలోని యంత్రాలు మునిగిపోకుండా పై బెంచ్‌లోకి తీసుకొచ్చారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం ముందస్తు ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా షావల్స్, డ్రిల్స్ తదితర యంత్రాలను పై బెంచ్‌ల్లోకి తరలించారు. నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తోడేందుకు భారీ కెపాసిటీ పంప్‌లు ఏర్పాటు చేశారు. కాగా నాలుగు ఓసీపీల్లో 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. అలాగే 15.20లక్షల క్యూబిక్‌మీటర్ల మట్టి వెలికితీత పనులు ఆగిపోయాయి. ప్రధానంగా ఓసీపీ–3లో రోజుకు 24వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

నాలుగు రోజులుగా రామగుండం రీజియన్‌లో నమోదైన వర్షపాతం	
17-07-23	19-07-23
45 మి.మీ	38 మి.మీ
18-07-23	20-07-23
13మి.మీ	82 మి.మీ

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వరద నీటిని ఫొటో తీస్తున్న సీపీ రెమా రాజేశ్వరి, పోలీస్ అధికారులు

గోదావరిఖని(రామగుండం): భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి శుక్రవారం రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలను సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపీ ఆదేశాల మేరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం బతుకమ్మ వాగుపై వంతెన సైడ్‌వాల్ మరమ్మతు పనులు, కోటపల్లి మండలంలోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు బ్రిడ్జి, అన్నారం సరస్వతి బ్యారేజ్‌లను సందర్శించి ప్రాణహిత వరద ఉధృతిని పరిశీలించారు. రాబోయే మూడునాలుగు రోజుల్లో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు అలర్ట్‌గా ఉండాలన్నారు. పట్టణంలోని చెరువులు, వివిధ ప్రాజెక్టుల నీటి నిలవ్వలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిఘా ఉంచాలన్నారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ సీఐ వాసుదేవరావు, రూరల్ సీఐ విద్యాసాగర్ తదితరులున్నారు.

బ్యారేజీ.. బొక్కలవాగు పరిశీలన

మంథని: వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు తీసుకోవాలని సీపీ రెమా రాజేశ్వరి అధికారులకు సూచించారు. శుక్రవారం మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీ, సరస్వతి పంపుహౌస్‌ను పరిశీలించారు. నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెల్సుకున్నారు. అనంతరం మంథనిలోని బొక్కల వాగును పరిశీలించారు. సీపీ వెంట ఏసీపీ తులా శ్రీనివాస్, మంథని సీఐ సతీష్, ఎస్‌ఐలు ఆది మధుసూదన్, రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టు డ్యాంపై ఉన్నతాధికారుల సందడి

రామగుండం: రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తొలిసారిగా శుక్రవారం ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు. వరద నీటి దృశ్యాలను పరిశీలిస్తూ సెల్ఫీ తీసుకున్నారు. కాగా నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విష్ణుప్రసాద్, ఇతర అధికారుల బృందం ప్రాజెక్టు వద్ద ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ఎల్లంపల్లి డ్యాంపై సీపీతో పాటు డీసీపీ వైభవ్ గైక్వాడ్, పోలీసు ఉన్నతాధికారులు జల దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. సీపీ బందోబస్తులో రామగుండం సీఐ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

బ్యాక్‌వాటర్ సమస్య లేకుండా చూడండి



గోదావరిలో పెరిగిన నీటి ప్రవాహం

గోదావరిఖని(రామగుండం): ఎల్లంపల్లి గేట్లు ఎత్తి వేస్తున్న నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో బ్యాక్ వాటర్ సమస్య లేకుండా చూడాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గోదావరిఖని పట్టణం సప్తగిరికాలనీకి బ్యాక్‌వాటర్ వచ్చే అవకాశం ఉందన్నారు.

జలమయంగా మారిన రోడ్లు



బురద రోడ్డును పరిశీలిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని పలు రోడ్లు జలమయంగా మారాయి. వెంకటేశ్వరకాలనీలో బురదగా మారిన రోడ్డును డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ సందర్శించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడీకే–2 కల్వర్టుపై నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

మత్తడి దూకుతున్న చెరువులు, కుంటలు



దస్తగిరిపల్లి-కొత్తపల్లి రహదారి వంతెనపై ప్రయాణికుల ఇక్కట్లు

సుల్తానాబాద్‌రూరల్/ఓదెల: సుల్తానాబాద్ మండలంలోని గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండలా. నీరుకుల్ల మానేరు వాగులో చెక్‌డ్యాం మత్తడి దూకుతుంది. ఓదెల మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాల వాసులను సంబంధిత శాఖ అధికారులు అలర్ట్ చేశారు.

లోలెవల్ కాజ్‌వే కష్టాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రాంతంలో వాగులు, వంకల్లోకి నీరు సమృద్ధిగా చేరుతోంది. పెద్దపల్లి శివారు రంగంపల్లి వద్ద వరదనీటిలో స్థానికులు చేపలు పట్టారు. దస్తగిరిపల్లి–కొత్తపల్లి గ్రామాల మధ్య లో లెవల్ కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.



పెద్దపల్లి శివారు వరదలో స్థానికుల చేపల వేట



మత్తడి దూకుతున్న పెద్దకల్వల గ్రామ చెరువు



ప్రవహిస్తున్న బొక్కలవాగు

విపత్తు యోధులు సిద్ధం..!

- వరదలను ఎదుర్కొనేందుకు ఫైర్‌సర్వీస్ సమాయత్తం
- సిబ్బందికి సెలవులు రద్దు చేసిన ఉన్నతాధికారులు
- స్పీడ్‌బోట్లు, వాహనాలు, ఎక్విప్‌మెంట్ సిద్ధం
- ఎల్‌ఎండీలో రెస్క్యూ ఆపరేషన్ మాక్‌డ్రిల్
- శిథిలాల్లో చిక్కిన వారిని రక్షించే ప్రత్యేక కెమెరాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో జోరుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అగ్నిశాఖలతోపాటే కీలకమైన ఫైర్‌సర్వీసు కూడా సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లీవుల్లో ఉన్న సిబ్బంది అంతా ప్రభుత్వ అత్యవసర ఆదేశాలతో వెంటనే వచ్చి విధుల్లో చేరారని, 24 గంటలపాటు అందుబాటులో ఉన్నామని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ (డీఎఫ్‌ఓ) తగరం వెంకన్న వెల్లడించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వర్షం వల్ల ఎక్కడ ఎలాంటి వరదలు వచ్చినా.. లోతట్టు ప్రాంతాలు జలమయం అయినా.. వెంటనే అందుబాటులో ఉండేలా అన్నిఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నీటిపారుదల, రెవెన్యూ, పోలీసులతో సంప్రదింపులుఉ జరుపుతూ, ఎక్కడ ఎలాంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారి వద్దఉన్న మ్యాన్‌పవర్, ఎక్విప్‌మెంట్, యాక్షన్ ప్లాన్‌ని డీఎఫ్‌వో వెంకన్న ప్రభుత్వానికి సమర్పించారు.



ఎల్‌ఎండీలో మాక్‌డ్రిల్ చేస్తున్న అధికారులు



సిద్ధంగా ఉన్న యోధ వాహనాలు

ప్రత్యేక ఎక్విప్‌మెంట్..

ఫైర్‌సర్వీస్ వద్ద లైఫ్‌జాకెట్లు, ఇన్‌ఫ్లేటబుల్ బోట్లు, స్విమ్మర్లు, గ్లోవ్స్, రోప్స్, కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో ఫైర్‌సర్వీస్ అధికారులు డీజీపీ ఆదేశాల మేరకు అత్యవసర సేవల్లో ఇప్పటికే చేరిపోయారు. ముఖ్యంగా ఎగువమానేరు, మధ్యమానేరు, లోయర్‌మానేరు, ఎల్లంపల్లి, గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద అగ్నిమాపక సిబ్బందిని ఇప్పటికే మోహరించారు. వానల తీవ్రత, మిడ్‌మానేరులో పరీవాహక ప్రాంతాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త బోటు కొనేందుకు ఎస్పీ కూడా సుముఖత వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఎల్‌ఎండీలో అగ్నిమాపక అధికారులు మాక్‌డ్రిల్ ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అగ్నిమాపక అధికారులు అవసరాన్ని బట్టి సింగరేణి రెస్క్యూ బృందాలను సైతం వినియోగించుకునే వీలుంది.

విక్టిమ్ లొకేషన్ కెమెరా..

కరీంనగర్ జిల్లా అగ్నిమాపక కేంద్రంలో విక్టిమ్ లొకేషన్ కెమెరా అందుబాటులో ఉంది. వరద ఉధృతికి పాత ఇళ్లు కూలితే.. శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను గుర్తించేందుకు ఉపయోగపడే కెమెరా ఇది. సుమారు 10 మీటర్ల కింద శిథిలాల్లో చిక్కుకున్న మనుషులు, జంతువులు.. ఏవైనా సరే దీని ద్వారా నేరుగా చూసే వీలు చిక్కుతుంది. అదేవిధంగా దీనిలో ఉండే కేబుల్ కెమెరా ద్వారా శిథిలాలకు రంధ్రం చేసిచూసే వీలుంటుంది. ఈ కెమెరా దాదాపు రూ.12 లక్షల విలువ చేస్తుందని అధికారులు తెలిపారు.

24 గంటలు అందుబాటులో ఉంటాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు మేం 24 గంటలపాటు విధుల్లోనే ఉంటున్నాం. మా సిబ్బంది సెలవులు రద్దుచేసుకున్నారు. ప్రజలు ఎక్కడ నీటిలో చిక్కుకున్నా.. కాపాడేందుకు, లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వెంకన్న, డీఎఫ్‌వో

ఉధృతంగా గోదావరి



ఘాట్స్ వద్ద హెచ్చరిక రిబ్బన్ కడుతున్న సిబ్బంది

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎల్లంపల్లి గేట్లు ఎత్తడంతో నీటి ప్రవాహం పెరిగింది. నదిలోకి ఎవరూ వెళ్లకుండా ఘాట్స్ వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో హెచ్చరిక రిబ్బన్ కట్టించారు.

వరద నీటిలో ఇళ్లు



ఇళ్లలోకి చేరిన నీరు

జ్యోతినగర్(రామగుండం): కార్పొరేషన్ 23వ డివిజన్ మోమిన్‌నగర్‌లో ఇండ్లలోకి వరద రావడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, సిబ్బంది జేసీబీతో వరద నీరు వెళ్లేందుకు కాలువ తవ్వడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

క్లుప్తంగా

నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి

గోదావరిఖని: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆదేశాలు చేశారు. కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్న కె.అంజయ్య, సిరిసిల్లకు చెందిన జి.శ్రీనివాస్, రామగుండంకు చెందిన ముస్కెం శ్రీనివాస్, జోన్-3 రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లింగంపెల్లి నరేందర్‌కు పదోన్నతి లభించింది.

సంకల్పయాత్ర విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంథని: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ శనివారం మంథని బ్రిడ్జిరోడ్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు లింగం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మంథనిలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలోని సుమారు రెండు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కావాల్సిన సామాజిక, ఆర్థిక భద్రతను కల్పించే పాత పెన్షన్ పునరుద్ధరించాలని కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. సంఘం బాధ్యులు మొగ్గరం సుధాకర్, దొంతుల కుమార్, కుల్ల రాజేందర్, బొజ్జ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏకే ఖాన్

పెద్దపల్లిరూరల్: పాఠశాలలో చేరిన విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు నాణ్యతతో కూడిన ఆహారాన్ని ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడాలని మైనార్టీ గురుకులాల అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్ అన్నారు. పెద్దపల్లి శివారు రంగంపల్లిలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి వసతులపై ఆరా తీశారు. భోజన వసతి తదితర సౌకర్యాలు, విద్యాబోధన విషయాలపై విద్యార్థినులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశముందని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మెహరాజ్‌మహమ్మద్, విజిలెన్స్ అధికారులు అక్రమ్‌పాషా, షౌకత్ అలీ, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఆస్మాజబిన్ తదితరులున్నారు.

వర్షాలు తగ్గే వరకు సెలవులు పెట్టొద్దు

- నగర మేయర్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతోపాటు ఎల్లంపల్లి నీటిని దిగువకు వదలుతున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుచరణ్, సూపరింటెండెంట్ మనోహర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్, నాగభూషణం, సునీల్, శానిటరీ సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యవసరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. వర్షాల ప్రభావం తగ్గేంత వరకు మున్సిపల్ సిబ్బంది సెలవులు తీసుకోవద్దని ఆదేశించారు. మల్కాపూర్ శివారులో ముంపు ముప్పు పొంచి ఉన్న ప్రాంతంలో, అక్రమంగా వెలసిన గుడిసెలను తొలగించి అక్కడ ఉంటున్న వారికి ప్రమాదం జరగకుండా చూడాలన్నారు. నగరపాలక కార్యాలయంలో 24 గంటలపాటు కాల్ సెంటర్ సేవలను అందుబాటులో ఉంచాలని, సాయం కోసం ఫోన్ వచ్చిన తక్షణమే డిసాస్టర్ రెస్పాన్స్ టీమ్ స్పందించేలా వాహనాలు, ఇంధనం, పనిముట్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బందికి సేఫ్టీ కిట్ అందజేయాలని, ప్రమాదం జరగకుండా బూట్లు, రెయిన్ కోట్, చేతి తొడుగులు ధరించి పని చేయాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మెప్మా సిబ్బంది సహకారంతో ప్రతి ఆదివారం 10 గంటలకు పది నిమిషాలు, డ్రై డే కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించాలని, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు.

భయం గుప్పిట్లో బల్దియా ప్రజలు

- వర్షాలు కురుస్తున్నా మొదలుకాని యాక్షన్ ప్లాన్
- అందుబాటులో లేని కీలక అధికారులు



కళ్యాణ్‌నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

కోల్‌సిటీ(రామగుండం): ఇటీవల కురుస్తున్న వర్షాలకు రామగుండం నగరపాలక సంస్థ ప్రజలు భయం గుప్పిట్లో వణుకుతున్నారు. ఒకవైపు సిల్ట్ తీయని మేజర్ నాలాలు, మరోవైపు బురదమయంగా మారిన రహదారులు, ఇంకోవైపు మురుగునీటితో పొంగి పొర్లుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మ్యాన్‌హోళ్లు, ఎక్కడిక్కడ రోడ్లపై నిలిచిపోతున్న వరద నీరు, అపరిశుభ్ర వాతావరణానికి పెరుగుతున్న దోమలతో నరకయాతకు గురవుతున్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదలపై తక్షణం చర్యలు తీసుకునేందుకు కీలకమైన అధికారులు అందుబాటలో లేకపోవడంతో అయోమయం, గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. 25 రోజులుగా కమిషనర్ లేకపోవడంలో పాలన వ్యవస్థ పూర్తిగా గాడితప్పింది. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన బి.సుమన్‌రావు 15 రోజులపాటు సెలవుపెట్టి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పని చేస్తున్న సీహెచ్.నాగేశ్వర్‌ను ఈనెల 15న ప్రభుత్వం బదిలీ చేసింది. 18న రిలీవ్ అయిన సుమన్‌రావు, ఇన్‌చార్జి బాధ్యతలను ఎస్‌ఈ చిన్నారావుకు అప్పగించారు. కానీ ఎస్‌ఈ అప్పటికే ఈనెల 30 వరకు సెలవు పెట్టారు. కొత్త కమిషనర్ విధుల్లో చేరలేదు. దీనికి తోడు డిప్యూటీ కమిషనర్‌గా పని చేసిన నారాయణరావు జీహెచ్‌ఎంసీకి బదిలీ అయ్యాడు. ఆయన స్థానంలో కరీంనగర్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న ఆర్.త్రయంబకేశ్వర్‌రావును నియమిస్తూ బదిలీ చేశారు. ఆయన కూడా విధుల్లో చేరలేదు. ఇంజినీరింగ్ విభాగంలో రవీందర్ అనే డీఈ కొత్తగూడంకు బదిలీ కాగా, మరో డీఈ మాధవితోపాటు ఇద్దరు ఏఈలు కూడా సెలవులో ఉన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో కూడా అధికారులు లేరు. కీలక నిర్ణయాలు తీసుకునే అధికారి లేకపోవడంతో పాలన గాడితప్పింది. ప్రస్తుతం ఈఈ సుచరణ్ ఒక్కడే అన్నీ తానై బల్దియాలో పర్యవేక్షిస్తున్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటన



బసంత్‌నగర్ వీధుల్లో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

పాలకుర్తి(రామగుండం): మండలంలోని బసంత్‌నగర్, రామారావుపల్లి, గుడిపల్లి గ్రామాల్లో శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రియాంక పర్యటించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ చర్యలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయి అధికారులచే కమిటీ ఏర్పాటు చేసి వారి పని తీరును పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో అదనపు కలెక్టర్‌తో పాటు ఏసీపీ వెంకటేశ్వర్లు, జిల్లా ఫారెస్ట్ అధికారి శివయ్య, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళిలతో కూడిన బృందం ఆయా గ్రామాల్లో పర్యటించి స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ తదితర విషయాలను ఇంటింటా తిరుగుతూ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె మూలంగా చెత్త సేకరణ జరుగడం లేదని, ఇతరులను విధుల్లోకి తీసుకుంటే పంచాయతీ కార్మికులు అడ్డుకుంటున్నారని అధికారులు, అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీల కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీవో షబ్బీర్‌పాషా, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్, ఐకేపీ ఏపీఎం సదానందం, మండల కోఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడుదాం

- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రజాసమస్యలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. పెద్దపల్లిలో శుక్రవారం కోడం స్వామి అధ్యక్షతన జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజాసమస్యలను ఎంచుకుని వాటి సాధనకు పోరాటాలు చేయాల్సిన అవసరముందన్నారు. ఈనెల 26 నుంచి 30 వరకు సేవ్ ఆర్టీసీ పేరుతో డిపోల ముందు ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 7న ప్రజాసమస్యలపై కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, నాయకులు కలవేన శంకర్, రాజారత్నం, ఉదయ్, మానస్‌కుమార్, మాటేటి శంకర్, శ్రీనివాసరెడ్డి, గట్టయ్య, లెనిన్, సృజన్, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన చంద్రమౌళిని శుక్రవారం తహసీల్దార్ రామ్మోహన్ ఎదుట బైండోవర్ చేశారు. బేగంపేట శివారులోని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడంతోపాటు అదే భూమిని మరో వ్యక్తికి అమ్మినందుకు బైండోవర్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిని అమ్మినా, కొన్నా చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సబ్బితం సర్పంచ్‌కు నోటీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీలో దుర్వినియోగమైన రూ.2,02,210 నిధులను రికవరీ చేయాలంటూ జిల్లా పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేశారు. గ్రామానికి చెందిన కందుల అశోక్ కొంతకాలంగా పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపిన అధికారులు నిధులు దుర్వినియోగమైనట్లు తేలగా, వాటి రికవరీకి చర్యలు చేపట్టారు. వారంలోగా నిధులు జమ చేయాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. ఇవేకాకుండా ఇంజినీరింగ్ పనుల్లోనూ ఇంకా అవకతవకలు ఉన్నాయని సంబంధిత అధికారులు విచారణ జరపడంలో కాలయాపన చేస్తున్నారని ఫిర్యాదుదారు కందుల అశోక్ ఆరోపించారు. ఈ విచారణ పూర్తి చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కన్నాలలో కూలిన గోడ



కూలిన గుడిసె గోడ వద్ద బాధితుడు మల్లయ్య

పాలకుర్తి(రామగుండం): వానల ధాటికి మండలంలోని కన్నాల గ్రామానికి చెందిన తగురం మల్లయ్య పూరిగుడిసె గోడలు కూలిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ల నియామకం

కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం రత్నాపూర్‌లో రైతువేదిక వద్ద రూ.4.50 కోట్ల సింగరేణి నిధులతో ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇద్దరు ఆపరేటర్లను నియమిస్తూ ఎన్పీడీసీఎల్ మంథని డీఈ ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖని ఈస్ట్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న లైన్‌మెన్ కలవేన ఓదెలు, ఆకెనపల్లి సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న లైన్‌మెన్ అంగోతు మోతిలాల్‌ను ఆపరేటర్లుగా నియమించడంతో శుక్రవారం రామగిరి ఏఈ రాజును కలిసి విధుల్లో చేరారు. ఆపరేటర్లను గ్రామ సర్పంచ్ పల్లె ప్రతిమ, ఎంపీటీసీ దర్ముల రాజసంపత్‌లతో పాటు గ్రామస్తులు సన్మానించారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు విజయవంతం చేయాలి

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు విజయవంతం చేయాలని సీపీఐ మావోయిస్టు జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ప్రకటనలో కోరారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని స్థాపించే లక్ష్యంతో ఎంతోమంది అమరులు అయ్యారని, ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ఉదరవాద విధానాలు అమలు చేయడంతో రైతుల ఆత్మహత్యలు, కార్మికుల గెంటివేత, ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, దొంగతనాలు, మహిళలపై లింగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు, దళితులు, ఆదివాసులు, మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. సామ్రాజ్యవాద, దళారి, నిరంకుశ, పెట్టుబడిదారుల, దోపిడీ రాజ్యాన్ని కూల్చివేయడానికి దీర్ఘకాల ప్రజా యుద్ధంలో భాగస్వాములై అమరులైన వారి ఆశయ సాధనను నెరవేర్చడమే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

గుండెపోటుతో కరీంనగర్ డీఐఈవో మృతి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్: కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) టి.రాజ్యలక్ష్మి శుక్రవారం ఉదయం 10.20 నిమిషాలకు గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం వారి నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత మూడున్నరేళ్లగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి టైపిస్టుగా ఉద్యోగంలో చేరి జూనియర్ లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా, డీఐఈవోగా సేవలందించారు. భర్త పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో చేసి గతంలోనే పదవీ విరమణ పొందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వస్థలం సిరిసిల్ల జిల్లా అయినప్పటికి 30ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా కరీంనగర్‌లోని చైతన్యపురిలో స్థిరపడ్డారు. రాజ్యలక్ష్మి భౌతికకాయానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, తదితరులు నివాళి అర్పించారు.

బొగ్గుబాయి వార్తలు

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇల్లెందుక్లబ్‌లో గనుల్లో విద్యుత్ సరఫరా, నిర్వహణ, భద్రత చర్యలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ముందుగా గనిప్రమాదాల్లో మరణించిన వారి ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. భూగర్భ, ఓసీపీల్లో విద్యుత్ వల్ల జరుగు ప్రమాదాలు వాటి నియంత్రణకు తీసుకుంటున్న రక్షణ చర్యలపై చర్చించారు. విద్యుత్ నియంత్రణ, విద్యుత్ సరఫరా, ఎర్తింగ్, పవర్ ట్రాన్స్‌విషన్, లైఫ్ సేవింగ్ మెజర్‌మెంట్స్, లాకౌట్ అండ్ ట్యాగ్ ఔట్ గురించి తెలియజేశారు. సమావేశానికి ముందు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎలక్ట్రికల్ డీఎంఎస్ భిశ్వనాథ్‌బెహార, సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ-1,2,3 జీఎంలు బానోతు సైదులు, ఎ.మనోహర్, సుధాకర్, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బురదమయం



బురదగా మారిన ఓసీపీ-2 ఎస్ఎంఈ సెక్షన్ దారి

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2 ఎస్ఎంఈ సెక్షన్‌కు వెళ్లే దారి వర్షాలతో బురదగా మారింది. దీంతో కార్మికులు విధులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నా సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆరోపించారు. రహదారిని బాగు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం బొగ్గు ఉత్పత్తిపైనే దృష్టి సారించే అధికారులు, కార్మికులు పడుతున్న ఇబ్బందులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

2ఏ మోరి నుంచి నిలిచిన రాకపోకలు



2ఏ మోరి రోడ్డుపై నిలిచిన నీరు

గోదావరిఖనిటౌన్(రామగుండం): సింగరేణి కార్మికులు నిత్యం మైన్‌లకు వెళ్లే స్థానిక 2ఏ మోరి దారి రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద నీటితో మునిగిపోయింది. దీంతో శుక్రవారం రాకపోకలు బంద్ అయ్యాయి. అటుగా వెళ్లే వాహనదారులు, సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడాలి



ఉత్పత్తి వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ శ్రీనివాస్

కమాన్‌పూర్(మంథని): వర్షాల నేపథ్యంలో ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే.శ్రీనివాస్, అడ్వైజర్ మైనింగ్ డీఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఓసీపీ-2 ఉపరితల గనిని సందర్శించి పనులను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఉత్పత్తి, రవాణాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలతో ఉపరితల గనుల్లో నిలిచే నీటిని పంపులతో ఎప్పటికప్పుడు బయటికి పంపించే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ×నా రక్షణ నా బాధ్యత×తో ప్రతి ఒక్కరూ పని చేస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. డైరెక్టర్స్ వెంట ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు సీతారామం, బైద్య, జైనుల్లా బద్దీన్, రాధాకృష్ణ, నాగేశ్వరరావు, రాజేందర్, నాగరాజు తదితరులున్నారు.

సింగరేణి యాజమాన్యంపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): జాతీయ సంఘాలతో ఐఎఫ్‌టీయూ యూనియన్‌ను సమానంగా చూడటంలేదని పేర్కొంటూ నాయకులు డిప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాసులుకు శుక్రవారం హైదరాబాద్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సింగరేణిలో జరిగిన తొలిసారి ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేట్, రెండోసారి జరిగిన ఎన్నికల్లో ఆర్జీ-1,2 ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘంగా గెలుపొందిందన్నారు. ఈక్రమంలో చర్చలకు మాయూనియన్‌ను ఎందుకు ఆహ్వానించడం లేదని ప్రశ్నించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన క్రమంలో రిజిస్టర్ కలిగిన అన్ని సంఘాలను చర్చలకు ఆహ్వానించాలన్నారు. గతనెల 13న చేసుకున్న ఒప్పందం ప్రకారం ముందుకెళ్లాలన్నారు. దీనిపై స్పందించిన అధికారి సమస్య పరిష్కారానికి యాజమాన్యంతో చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. గౌరవ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ స్కైవే ఏర్పాటుకు సానుకూలం

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్



రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన కేటీఆర్, వినోద్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి శామీర్‌పేట మధ్యలో డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణంతో కరీంనగర్–హైదరాబాద్ మధ్యలో ప్రయాణానికి మహర్దశ కలగనుంది. ఇటీవల ఈ ప్రతిపాదనను కేంద్రం వద్ద ఉంచినప్పుడు కేంద్రం సానుకూలత వ్యక్తం చేశారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ శుక్రవారం వెల్లడించారు. డబుల్ డెక్కర్ స్కైవే మూడంచెల పద్ధతి ఉంటుందని, పైభాగంలో మెట్రో రైలు, మధ్యలో ఫ్లైఓవర్, కింది భాగంలో రోడ్డు ఉంటుందని వివరించారు. పనులు పూర్తయ్యే నాటికి దాదాపు ఐదువేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. కరీంనగర్ మార్గంలో హైదరాబాద్ నుంచి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణంతో సిద్దిపేట, కరీంనగర్ జిల్లా, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు హైదరాబాద్ కు సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్, ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డిలతో కలిసి తాను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో జరిపిన చర్చల ఫలితంగా ఈ ప్రతిపాదనలు కొలిక్కి వచ్చినట్లు తెలిపారు.

రూ.లక్ష జరిమానా

గోదావరిఖని(రామగుండం): బైండోవర్ నిబంధనలు విస్మరించి బెల్లం అక్రమ రవాణాదారు పాలకుర్తి మండలం జీడీనగర్‌కు చెందిన సంపంగి కుమార్‌కు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం రూ.లక్ష జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ రమేష్ వివరాలు.. కుమార్ కొంతమందితో ముఠాగా ఏర్పడి మహారాష్ట్రలోని వీరుర్ నుంచి బెల్లాన్ని అక్రమంగా రైలులో తీసుకవచ్చి జీడీనగర్ పరిసర ప్రాంతాల్లో గుడుంబా తయారీదారులకు అమ్ముతున్నాడు. జనవరి 1న కుమార్‌తో పాటు ఐదుగురిని అరెస్ట్ చేసి, మూడు బైకులు సీజ్ చేసినట్లు వివరించారు. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాకుండా మళ్లీ గుడుంబా బెల్లం అమ్ముతుండగా మే 26న అరెస్ట్ చేసి నాలుగు క్వింటాళ్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. బైండోవర్ ఉల్లంఘించడంతో జరిమానా విధించినట్లు వివరించారు. జరిమానా చెల్లింపునకు సమయం కోరిన కుమార్ శుక్రవారం బ్యాంకు చలానా రూపంలో రూ.లక్ష ఎక్సైజ్ శాఖకు చెల్లించినట్లు తెలిపారు.

టబ్బులో పడి చిన్నారి మృతి



సాన్వీ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన 18 నెలల కొత్తపల్లి సాన్వీ శుక్రవారం ప్రమాదవశాత్తు నీటి టబ్బులో పడి మృతిచెందింది. స్థానికుల వివరాలు.. కొత్తపల్లి మహేష్, స్రవంతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు సాన్వీ ఇంటి ముందు ఆడుకుంటుండగా తల్లి చిన్న కూతురుకు పాలుపడుతోంది. ఆడుకుంటున్న సాన్వీ సమీపంలోని టబ్బు వద్దకు వెళ్లి నీటిలో పడిపోయింది. గమనించిన తల్లి వెంటనే వచ్చి బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు బంధువులు తెలిపారు. చిన్నారి సాన్వీ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.